క్లుప్తంగా

మునిశేఖర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో ఫిజియాలజీ విభాగం పరిశోధక విద్యార్థి కర్ణ మునిశేఖర్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శరణ్‌బిసింగ్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్స్ ఆఫ్ కౌ గీ ఆన్ లిపిడ్ పెరాక్సిడేషన్ అండ్ లిపిడ్ ప్రొఫైల్ ఇన్ హెల్తీ హ్యూమన్ వాలంటీర్స్ బిఫోర్ అండ్ ఆఫ్టర్ కన్జుమింగ్ గీ' అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



ఆవిష్కరణలో కలెక్టర్, సీఆర్‌సీ ప్రతినిధులు

తిరుపతి అర్బన్: నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ పోస్టర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ కేసీ కుసుమకుమారి, డిప్యూటీ చైర్మన్ వై.కోటేశ్వరబాబు, డిప్యూటీ చైర్‌పర్సన్ బి.సుచరిత, జనరల్ సెక్రటరీ భరత్‌రెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పాకాల: మండల కేంద్రంలోని సచివాలయంలో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పంచాయతీకి చెందిన 200 మందికి బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేశారు. సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాకాల సర్పంచ్ సుబ్రమణ్యం కస్తూరి, వైస్ సర్పంచ్ ప్రకాష్ రెడ్డి, ఈఓ మోతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు న్యాయవాదుల కృతజ్ఞతలు

తిరుపతి లీగల్: తిరుపతి ప్రకాశం రోడ్డు నుంచి కోర్టుకు వెళ్లే రోడ్డు విస్తరణకు సహకరించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి తిరుపతి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు విస్తరణకు అనుమతులు రావడంతో బుధవారం కార్పొరేటర్లు నరసింహాచారి, వెంకటేశ్వర్లతో పాటు న్యాయవాదులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. కోర్టులకు వెళ్లడానికి ట్రాఫిక్ సమస్యతో చాలా రోజులుగా ఇబ్బంది పడ్డామన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా టీటీడీ అధికారులతో చర్చించి రోడ్డు విస్తరణకు టీటీడీ పాలకమండలి అంగీకరించేలా ఆయన చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి హరనాథనాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీర్తిశేఖర్, కోటేశ్వరరెడ్డి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ చంద్రశేఖర్‌రెడ్డి, వేశాలమ్మగుడి చైర్మన్ విజయకుమార్, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు, సీనియర్ న్యాయవాదులు మోహన్, రమణ, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ

భాకరాపేట: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు గ్రామ పంచాయతీలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రోజు కూలీ రూ.15 పెరుగుతుందని తెలిపారు. తద్వారా రూ.272 వస్తుందని చెప్పారు. మృత్యుంజయరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు నాగేశ్వర, రాధా సులోచన, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

నియామకం

భాకరాపేట: తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా పాటూరి నవీన్‌ను ఎంపిక చేస్తూ ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 9, 10వ తేదీల్లో తిరుపతి మహతిలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించనున్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన నవీన్ ఎంపికపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీసీఎస్ సమావేశంపై అసంతృప్తి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ రాష్ట్రస్థాయి సీసీఎస్ పాలకమండలి సర్వసభ్య సమావేశం మంగళవారం డెలిగేట్స్‌కు అందుబాటులో నిర్వహించకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తిరుపతిలో కాకుండా రూరల్ ప్రాంతంలో నగరానికి దూరంగా నిర్వహించడం సరికాదన్నారు. సమావేశానికి చేరుకోవడానికి పలువురికి అడ్రస్ తెలియకపోవడంతో ఇబ్బందులు పడ్డారని యూనియన్ నేతలు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. సమావేశానికి రూ.2లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నారని అంత ఖర్చు చేయలేదని వాపోయారు.

మహిళా అభ్యున్నతే లక్ష్యం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- శిల్పారామంలో డ్వాక్రా బజార్ ప్రారంభం
- హాజరైన మంత్రి రోజా, ఎమ్మెల్సీ యండపల్లి, కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి రోజా, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): మహిళలు స్వయం శక్తితో ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి , మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్), డీఆర్డీఏ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్–అఖిల భారత డ్వాక్రా బజార్–2023ను మంత్రులు, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో ఆ రాష్ట్రం, దేశం పురోగతిలో ఉంటుందన్నారు. ఆ బాటలోనే సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి అని, నవరత్నాల ద్వారా మహిళల పేరుపైనే అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. మంత్రి రోజా మాట్లాడుతూ.. సరస్ డ్వాక్రా బజార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాల సాకారం అందిస్తోందన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు సుమారు 10 రాష్ట్రాలకు చెందిన 215కు పైగా స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారని తెలిపారు. డ్రై ఫ్లవర్స్, వెదురు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తులు, చీరలు, ఆభరణాలు, హ్యాండ్ లూమ్స్, హస్తకళలు, బెడ్‌షీట్లు, గృహాలంకరణ వస్తువులు, సంప్రదాయ నేత వస్త్రాలు వంటి ప్రదర్శనలో ఉంచారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పద్మావతి పురం సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ భార్గవి, ఏఎంసీ చైర్మన్ శ్రీవిద్య, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా రాధమ్మ పాల్గొన్నారు.

పెన్షనర్లు సమాజానికి మార్గదర్శకులు



తిరుపతి బాలాజీ కాలనీలో పెన్షనర్స్ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- వారి సంక్షేమానికి నా వంతు కృషి చేస్తా
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



హరేకృష్ణ నేత్రాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ పెన్షనర్లు తమ అనుభవాన్ని ప్రజా శ్రేయస్సుకు వినియోగిస్తూ మంచి కార్యక్రమాలతో సమాజానికి మార్గదర్శులు కావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఎల్ఐసీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెన్షనర్లందరూ ఐక్యతతో భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. పెన్షనర్లకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతన భవనంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మార్కొండారెడ్డి, రాజశేఖర్ మాట్లాడుతూ.. 2009 నుంచి పెన్షనర్లకు సొంత భవన నిర్మాణానికి ఎంతో కృషి చేశామని, భవనం ప్రారంభంతో తమ కృషి ఫలించిందన్నారు. పెన్షనర్ల సంక్షేమమే లక్ష్యంగా అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. దీనికి అందరి సహకారం అవసరమని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు సీకే. రేవతి, హనుమంతనాయక్, రామస్వామి వెంకటేశ్వర్లు, సంఘం నేతలు ఆర్.శ్రీనివాసులురెడ్డి, ఎం.పరమశివయ్య, విశ్వనాథనాయుడు, జె.రామలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు రఘురామిరెడ్డి ఊతగుంట మోహన్ పాల్గొన్నారు.

హరేకృష్ణ నేత్రాలయం ప్రారంభం

నగరంలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హరేకృష్ణ నేత్రాలయాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ జ్యోతి ప్రజ్వలన చేసి రాధాకృష్ణులకు పూజలు నిర్వహించారు. హరేకృష్ణ నేత్రాలయ డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన కంటి వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో తిరుపతిలో హరేకృష్ణ నేత్రాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. కంటి వైద్య చికిత్సలకు అవసరమైన అన్ని రకాల ఆధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. కంటి శుక్లం, బైఫోకల్, ట్రైఫోకల్, ఐవోఎల్, లాసిక్, రెటీనా వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఖరీదైన వైద్యాన్ని కూడా తక్కువ ఖర్చుతో అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సిద్ధారెడ్డి, డాక్టర్ నివేదిత, ఇస్కాన్ ప్రతినిధులు లీలాపారాయణదాస్, రూపేష్ చైతన్య ప్రభుదాస్, బలభద్ర ప్రభుదాస్, క్రిష్ణ కిశోర్ గోపాల్ దాస్, భరత్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లను అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మూడేళ్లు చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. చిన్నారులు వివిధ పాఠ్యాంశాల్లో ప్రదర్శించిన అంశాలు వారి సృజనాత్మకతను చాటాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ కేఆర్ శ్వేత, చైర్ పర్సన్ రమాదేవి, ప్రిన్సిపల్ శారాస్మిత పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నిక





ఎన్.మధుసూదన్‌రెడ్డి, చిన్నరెడ్డెప్పనాయుడు, గౌరీశంకర్‌రాజు

పాకాల: స్థానిక కోర్టులో బుధవారం జరిగిన పాకాల న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో నెల్లేపల్లె మధుసూదన్‌రెడ్డి ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా బెల్లెం చిన్నరెడ్డెప్ప నాయుడు, సెక్రటరీగా గౌరీశంకర్‌రాజు ఎన్నికయ్యారు. న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు డి.సుబ్రమణ్యంరెడ్డి, సీనియర్ న్యాయవాది జి.గురుస్వామినాయుడు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



వివాహ కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన వివాహ కానుకను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. స్థానిక కొత్తపేటకు చెందిన గేయశ్రీ, నాగార్జునలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు నూతన వధూవరులకు ఎమ్మెల్యే పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాచికం, మహార్షపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కోలా అనిల్, ముదికుప్పం రామ్మూర్తి, బాహర్ పాల్గొన్నారు.

తిరుపతికి విమానాల సంఖ్య పెంచండి

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి తిరుపతి ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి
- త్వరలో కువైట్ నుంచి నేరుగా తిరుపతికి విమాన సౌకర్యానికి హామీ



కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో చర్చిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి దేశంలోని ప్రధాన విమానాశ్రయాల మధ్య మరింత ఎక్కువ కనెక్టివిటీ అవసరమని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అన్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో భేటీ అయ్యారు. తిరుపతి విమానాశ్రయానికి ప్రధాన నగరాల నుంచి మరిన్ని విమానాలు నడపాలని కోరారు. తిరుపతి ప్రసిద్ధ పర్యాటక కేంద్రం మాత్రమే కాకుండా అనేక ప్రముఖ విద్యాసంస్థలకు నిలయంగా ఉంటూ ఎకనమికల్ జోన్‌గా ఉందన్నారు. ప్రధాన పరిశ్రమలు, అంతర్జాతీయ కంపెనీలు ఈ ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ విమానాల అవసరాన్ని తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలో కువైట్ నుంచి తిరుపతికి అంతర్జాతీయ విమాన సౌకర్యం కల్పిస్తామని చెప్పినట్లు ఎంపీ తెలిపారు. పౌర విమానయాన శాఖ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీలను కూడా ఎంపీ కలిశారు.

టీడీపీ కార్యాలయం ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ

- తిరుమల క్షేత్రంపై రాజకీయం చేయడం సిగ్గుచేటు
- ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం విమర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: అధికార దాహం కోసం రాజకీయ కుట్రలకు తెరలేపుతూ నిత్యం అసత్య ప్రచారాలతో అలజడి సృష్టించే దిశగా మంగళగిరి టీడీపీ కార్యాలయం ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ నడుస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని సైతం రాజకీయాలకు పావుగా వాడుకుంటూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీడీపీ నేతలు ధర్నాలు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలలో గంజాయి పలుకులు ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి నుంచి నిఘా అధికారులు పట్టుకున్న విషయం విదితమేనన్నారు. దీంతో తిరుమల నిఘా ఎంత పటిష్టంగా ఉందో అర్థమవుతుందన్నారు. అయితే దీనిని ఆసరాగా తీసుకుని మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రాద్ధాంతరం చేయడం దొంగే దొంగ.. దొంగ.. అని అరిచినట్లుందన్నారు. నిరసన పాల్గొన్న వారిలో ఎంతమంది టీడీపీ పాలనలో మద్యం, మాసం, గంజాయిని తిరుమలలో అమ్మి లక్షలు గడించారో ఆలోచించుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో తిరుమలలో దొరికిన గంజాయి, మద్యం, మాంసం పట్టుకున్న సంఘటనలు చిట్టా విప్పితే ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రత కాపాడే ప్రయత్నం చేసింది తప్ప రాజకీయ లబ్ధి కోసం ఎప్పుడూ వాడుకోలేదన్నారు. టీడీపీ ప్యాలెస్‌లో ఏడాది పాటు 24 గంటలూ పనిచేసే ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ నడుస్తోందన్నారు. ఈ ఫ్యాక్టరీ రాష్ట్ర స్థాయి నాయకులకు, జిల్లా, మండల నాయకులకు టూల్ కిట్ అందజేస్తుందని తెలిపారు. ఎవరెవరు ఏయే అంశాలపై అబద్ధాలు చెప్పాలనే విషయాలు ఆ కిట్టులో ఉంటాయన్నారు. గతంలో తిరుమల పవిత్రత పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. సే నో డ్రగ్స్ నినాదంతో యువత సంక్షేమానికి ఆయన కృషి చేశారని తెలిపారు.

గర్భిణులకు పోషకాహారంపై అవగాహన



పోషణ్ పక్వాడలో ఐసీడీఎస్ అధికారులు

పాకాల: మండలంలోని మొగరాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. గర్భంలోని శిశువు, పాలిచ్చే తల్లులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నిరు. అప్పుడు పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు

తిరుపతి తుడా: నగరంలోని అంబేడ్కర్ కూడలి చుట్టూ కట్టిన ఫ్లెక్సీలను తొలగించాలని సమత సైనిక్‌దళ్ ప్రతినిధులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలిని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. విగ్రహం కనిపించకుండా కొంతమంది అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలను కడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇకపై పునరావృతం కాకుండా తగిన ఆదేశాలు జారీ చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. సమతా సైనిక్‌దళ్ తిరుపతి శాఖ అధ్యక్షుడు పున్నాగు సురేష్, నేతలు పీఎస్ చిరంజీవి, కె.రాధాకృష్ణ, చెన్నకేశవులు, రజనీకుమారి, పానకం ఇంద్రముని, రామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రజలే నా కుటుంబం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- ఆర్సీపురంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



కార్యక్రమానికి హాజరైన మహిళలు

రామచంద్రాపురం: ప్రజలే తన కుటుంబమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 3వ విడత వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 7031 మంది మహిళలకు రూ.7.65 కోట్ల మెగా చెక్కును ఆవిష్కరించారు. మహిళలు మంగళ హారతులతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా డ్వాక్రా సంఘ మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. తన సంపాదనలో 75 శాతం ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తామన్నారు. రాయలచెరువు తెగిపోతుందని భయపడుతున్న సమయంలో అక్కడే వారం పాటు ఉండి ప్రజలందరికీ మనోధైర్యాన్ని అందించామని గుర్తు చేశారు. ముంపు గ్రామాల ప్రజలకు నిత్యవసర సరుకులను అందించి ఆదుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే తాను సుఖంగా ఉండేవాణ్ణి కాదని, ప్రజల కష్టాల్లోనూ, సుఖాల్లోనూ తోడుంటానన్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆర్సీపురం ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేడుకగా సంకల్ప-2023



ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయ్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని సి.గొల్లపల్లిలో ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి ఇంటర్ కళాశాలల టెక్నికల్ సింపోజియం సంకల్ప–2023ను బుధవారం వేడుకగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, కార్యదర్శి ఆనందరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సింపోజియంను ప్రారంభించారు. విద్యార్థుల మేధస్సును సానబట్టేలా సరికొత్త ఆవిష్కరణలకు బీజం వేసేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కళాశాల కార్యదర్శి ఆనందరెడ్డి తెలిపారు. అనంతరం వివిధ సాంకేతిక అంశాలపై విద్యార్థులు పేపర్, పోస్టల్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ విజయ్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ భాస్కర్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివేలా అవగాహన కల్పించండి

- కలెక్టర్ వెంకటరమణారెడ్డి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సైకాలజిస్టులు

తిరుపతి అర్బన్: విద్యార్థులు ఒత్తిడితో కాకుండా ఇష్టంతో చదివేలా అవగాహన కల్పించాలని సైకాలజిస్టులకు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సూచించారు. బుధవారం జిల్లాలో కొత్తగా ఎంపికైన ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోషియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల, హాస్టల్స్ విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడానికి అవగాహన సదస్సులు నిర్వహించడానికి అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోషియేషన్ అధ్యక్షురాలు రాధ, జనరల్ సెక్రటరీ రేవతి, ట్రెజరర్ మౌనిక, ఉపాధ్యక్షురాలు లీలావతి పాల్గొన్నారు.

దోపిడీ కేసులో రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్: మహిళపై కత్తితో దాడిచేసి బంగారు నగలను దోచుకెళ్లిన కేసులో తమిళనాడు సేలం సేవ్వాపేటకు చెందిన బెల్లం వెంకటసుబ్రమణ్యం అలియాస్ వెంకటేశ్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణారెడ్డి వివరాల మేరకు.. 2015 నవంబర్‌లో తిరుపతి చిన్నబజారు వీధిలోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు వెంకటసుబ్రమణ్యం మహిళను బంగారు నగలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె అంగీకరించకపోవడంతో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె వద్ద ఉన్న రూ.1.50 లక్షల విలువైన 75 గ్రాముల బంగారు నగలను దోచుకెళ్లాడు. మహిళ భర్త రమేష్‌ఆచారి తిరుపతి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ శరత్ చంద్ర కేసు దర్యాప్తు చేసి నిందితుడు వెంకటసుబ్రమణ్యంను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు వెంకటసుబ్రమణ్యం ఇది వరకే వెస్టు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్టు పోలీసులు చార్జిషీటులో పేర్కొన్నారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు వెంకటసుబ్రమణ్యంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నిరుపయోగంగా జనరేటర్



తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జనరేటర్ నిరుపయోగంగా ఉంది. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్ ప్రస్తుతం తుప్పుపడుతోంది. ఇటీవల మూడు రోజులపాటు ఉరుములు, మెరుములతో కూడిన వర్షం పడింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల విధులకు తరచూ ఆటంకం ఏర్పడుతోంది. జనరేటర్ అందుబాటులోకి తేవాలని అధికారులు మొత్తుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. అంధకారంలోనే గంటల తరబడి సిబ్బంది నిరీక్షించినా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. అధికారులు ఇకనైనా జనరేటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

